




శ్రావణపల్లి గ్రామం

గ్రామంలో సింగరేణి అన్వేషణ విభాగం డ్రిల్లింగ్ (ఫైల్)

మెతుకు లాగేసుకుంటే బతుకేం కావాలి?

శ్రావణపల్లి ఓపెన్ కాస్టు ప్రాజెక్టుతో బంగారం పండిన భూములు మట్టి గుట్టలుగా మారనున్నాయి. పచ్చని పంటలతో కళకళలాడుతున్న పల్లెలు కాలుష్య కాసారాలు కాబోతున్నాయి. విరగకాసి కాసుల వర్షం కురిపించే వందల ఎకరాల మామిడి తోటలు కనుమరుగు కానున్నాయి. తమ జీవనాధారమైన భూములను, తరతరాలకు నీడనిచ్చిన గ్రామాలను వేలం వేయడాన్ని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. మెతుకు లాగేసుకుంటే తమ బతుకేం కావాలని ఆవేదన చెందుతున్నారు.

- వేలానికి శ్రావణపల్లి బొగ్గు బ్లాకు
- దక్కించుకునేందుకు పోటీ పడుతున్న ప్రైవేటు సంస్థలు
- గని కైవసానికి సింగరేణి ప్రయత్నాలు
- బొగ్గు తవ్వకాలను వ్యతిరేకిస్తున్న స్థానికులు
- ముంపులో శ్రావణపల్లి.. మరో ఆరు గ్రామాలపై తీవ్ర ప్రభావం

నెన్నెల, జూలై 29: నెన్నెల మండలంలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాకును కేంద్ర ప్రభుత్వం వేలానికి పెట్టింది. బొగ్గు తవ్వకాలు చేపడితే తమ ప్రాంతం బొందలగడ్డగా మారుతుందని గ్రామస్థులు ఆందోళన చెందుతు న్నారు. బొగ్గు తవ్వకాలతో శ్రావణ్‌పల్లి ముంపునకు గురవుతుండగా జండా వెంకటాపూర్, నార్వాయిపేట, జోగాపూర్, మందమర్రి మండలం లోని మామిడిగట్టు, సారంగపల్లి గ్రామాలపై తీవ్ర ప్రభావం పడనుంది. 350 గిరిజన కుటుంబాలు ఉన్న శ్రావణపల్లి గ్రామం ముంపునకు గురికానుంది. పసిడి పంటలు పండించి పది మందికి ఉపాధి కల్పించిన తాము మరి కొద్ది రోజుల్లో ఇతరుల వద్ద పనిచేయాల్సిన పరిస్థితి వస్తుందేమోనని భయపడుతున్నారు.

● మామిడితోటలకు నష్టం

నెన్నెల మండలం మామిడి తోటలకు ప్రసిద్ధి. ఈ ప్రాంతంలో సుమారు 14వేల ఎకరాల మామిడి తోటలు ఉండగా ఆరు వేల ఎకరాల తోటలు ఓసీపీ వల్ల కనుమరుగవుతాయి. మామిడి తోటలు తొలగిస్తే యేటా రూ.4 కోట్ల వరకు రైతులు నష్టపోనున్నారు. దీనికి తోడు 275 ఎకరాల ఆయకట్టు ఉన్న గోపాల్ చెరువు, 150 ఎకరాల సాగు చేస్తున్న పాత చెరువు, 180 ఎకరాలకు సాగు నీరందిస్తున్న లంబడికుంట, సుమారు 500 ఎకరాల ఆయకట్టు ఉన్న చిన్నచిన్న చెరువులు, కుంటలు కూడా ఓసీపీ వల్ల కాలగర్భంలో కలవబోతున్నాయి. దీంతో రైతులు, కూలీలు, చేతి వృత్తుల వారు భవిష్యత్తుపై బెంగ పెట్టుకున్నారు.

● నాటి నుంచే పోరాటం

బొగ్గు నిక్షేపాల కోసం సింగరేణి అన్వేషణ ప్రారంభించిన నాటి నుంచే వ్యతిరేకత ఉంది. శ్రావణపల్లి ఓపెన్ కాస్టు నిర్మాణ ప్రక్రియను సికాస అడ్డుకుంది. 1996 జూలై 5న శ్రావణపల్లిలో ఎక్స్‌టెన్షన్ బ్లాక్ పనులు చేపడుతున్న ఎక్స్‌ప్లోరేషన్ డిపార్టుమెంటుకు చెందిన రూ.60 లక్షల విలువ గల 4 రిగ్గులను దహనం చేసింది. 2005లో గ్రామానికి వచ్చిన సింగరేణి అధికారులపై ప్రజలు దాడి చేశారు. మరోసారి సర్వేకు వచ్చిన రెవెన్యూ, ఇంజనీరింగ్ అధికారులను నిర్బంధించారు. దీంతో 16 మంది గ్రామస్థులపై పోలీసులు కేసులు పెట్టారు. మానవహక్కుల వేదిక ఆధ్వర్యంలో బొగ్గుగనుల ఏర్పాటుకు వ్యతిరేకంగా సదస్సులు నిర్వహిం చడంతో అధికారులు వెనుకడుగు వేశారు. వాణిజ్య పద్ధతిలో బొగ్గు గనులను వేలం వేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడంతో అరబిందో రియాల్టీ అండ్ ఇన్‌ఫ్రాస్టక్చర్ అనే కార్పొరేట్ సంస్థ ముందుకు వచ్చింది. 2021 డిసెంబరు 7న గ్రామానికి వచ్చిన ఆ సంస్థ ప్రతినిధులను కార్మిక సంఘాల నాయకులు అడ్డుకున్నారు. ప్రజల వ్యతిరేకతను చూసి ప్రభుత్వం, సింగరేణి, ప్రైవేటు సంస్థలు బొగ్గు తవ్వకాల కోసం వెనుకడుగు వేయగా తాజాగా బొగ్గు బ్లాకులను కేటాయించేందుకు కేంద్ర ప్రభుత్వం టెండర్లు స్వీకరిస్తుండటంతో ప్రజలు కలవరపడుతున్నారు.

● బొగ్గు బ్లాకు దక్కించుకునేందుకు సింగరేణి యత్నాలు

శ్రావణపల్లి బ్లాకును దక్కించుకునేందుకు పలు కార్పొరేట్ సంస్థలు పోటీ పడుతుండగా బొగ్గు నిక్షేపాలను కనుగొన్న తమకే కేటాయించాలని సింగరేణి సంస్థ పట్టుబడుతోంది. నేరుగా కేటాయించడం కుదరదని, వేలంలో ప్రైవేటు కంపెనీలతో పోటీపడి కైవసం చేసుకోవాలని సింగరేణికి కేంద్ర ప్రభుత్వం సూచిస్తోంది. బొగ్గు బ్లాకుల వేలం టెండర్ల దాఖలు ప్రక్రియ ఆగస్టు 27తో ముగియనుంది. శ్రావణపల్లి చేజారితే భవిష్యత్తులో సంస్థ మనుగడకే ముప్పు వాటిల్లుతుందని సింగరేణి భావిస్తోంది. వేలంలో ఏదో ఓ సంస్థకు శ్రావణపల్లి బొగ్గు బ్లాకు కేటాయించడం ఖాయంగా కనిపిస్తోంది.

● 119.9 మిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలు

శ్రావణపల్లి ప్రాంతంలో బొగ్గు నిక్షేపాలను వెలికి తీసేందుకు మూడు దశాబ్దాల నుంచే సింగరేణి ప్రయత్నాలు చేస్తోంది. కోట్ల రూపాయలు వెచ్చించి సర్వేలు చేసింది. అన్వేషణ విభాగం ఆధ్వర్యంలో 129 చోట్ల డ్రిల్లింగ్‌లు చేపట్టింది. భూ సేకరణ కోసం ప్రభుత్వానికి నివేదికలు అందజేసింది. శ్రావణపల్లి పరిసర ప్రాంతాల్లో 11 సీముల్లో 119.9 మిలియన్ టన్నుల జీ-గ్రేడు బొగ్గు నిక్షేపాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ గని జీవిత కాలం దాదాపు 40 సంవత్సరాలుగా నిర్ణయించారు. ఓపెన్ కాస్టు ప్రాజెక్టు నిర్మాణానికి 1,936 హెక్టార్ల భూమి సేకరించాల్సి ఉంటుంది. ఇందులో 1,058 హెక్టార్ల భూమి ప్రైవేటు వ్యక్తులకు చెందినది కాగా, 878 హెక్టార్లు అటవి భూమిగా గుర్తించారు.

ఓపెన్ కాస్టుకు వ్యతిరేకంగా ఉద్యమిస్తాం



-ఏస్కూరి లక్ష్మణ్, మాజీ ఉపసర్పంచ్, శ్రావణపల్లి

పచ్చని పల్లెలను బొగ్గు బ్లాకుల పేరిట వేలానికి పెట్టడం సరికాదు. గ్రామాలను బొందల గడ్డలుగా మార్చే ఓసీపీ వద్దే వద్దు. శ్రావణ్‌పల్లిలో బొగ్గుగనిని రానివ్వం. బొగ్గు తవ్వకాలను అడ్డుకునేందుకు ఉద్యమిస్తాం. ఈ ప్రాంత ప్రజలంత ఏకమై దశల వారీగా ఆందోళనలు చేస్తాం. ఎట్టి పరిస్థితుల్లో ఓపెన్ కాస్టు కానిచ్చేది లేదు. పార్టీలకు అతీతంగా ఓపెన్ కాస్టులకు వ్యతిరేకంగా ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఊరు వదులుకోలేం...



-పాల్యా దేవాజీ, శ్రావణ్‌పల్లి గ్రామస్థుడు

గిరిజనులమైన మాకు భూమే ఆధారం. తాతల కాలం నుంచి భూములు సాగు చేసుకుని బతుకుతున్నాం. బోర్లు వేసుకొని భూములు అభివృద్ధి చేసుకున్నాం. పుట్ల కొద్ది వరి పండిస్తున్నాం. మామిడి తోటలతో ఉపాధి పొందుతున్నం. అలాంటి భూములను, కన్న తల్లి లాంటి ఊరిని వదలి పొమ్మంటే ఎలా...? చావైన రేవైనా ఇక్కడే జరగాలి. భూములు లాక్కుంటే ఇక్కడి ప్రజల బతుకు దుర్భరం అవుతుంది. బొగ్గు తవ్వకాల పేరిట వచ్చే అధికారులను గ్రామాల్లో అడుగు పెట్టనివ్వం.

సింగరేణి ప్రైవేటీకరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుట్ర



సభలో అభివాదం చేస్తున్న సీపీఎం నాయకులు

బెల్లంపల్లి, జూలై 29: సింగరేణి సంస్థను ప్రైవేటీకరణ చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చీకటి ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. సోమవారం కాంటా చౌరస్తా వద్ద భారత కమ్యూనిటీ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన సింగరేణి పరిరక్షణ బస్సు యాత్ర ప్రారంభానికి హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వానికి సింగరేణి పరిరక్షణపై చిత్తశుద్ధి ఉంటే కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఢిల్లీలో ధర్నాకు సిద్ధమవ్వాలని సూచించారు. సింగరేణి ప్రైవేటీకరణతో ప్రజలు, కార్మికులు నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. సింగరేణి ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ సింగరేణి పరిరక్షణ బస్సు యాత్ర చేపట్టామని, ఈ యాత్ర ఆగస్టు 5న కొత్తగూడెంలో ముగుస్తుందని పేర్కొన్నారు. సింగరేణి సంస్థలో రాష్ట్ర ప్రభుత్వానికి 51 శాతం హక్కు ఉందని, కేంద్ర ప్రభుత్వం పెత్తనం ఏమిటని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి సింగరేణిని ప్రైవేటీకరణ చేయడానికి కుట్రలు చేస్తున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తే అసెంబ్లీలో తీర్మానంతోపాటు అఖిలపక్షంతో కలిసి ఢిల్లీలో ధర్నా చేపట్టాలని డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సింగరేణి ప్రైవేటీకరణ లేదంటూనే బొగ్గు గనులను ఎందుకు వేలం వేస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజలకు ఈ విషయంపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సింగరేణి సంస్థ పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దిగి వచ్చే వరకు పోరాటాలు చేస్తామన్నారు. ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ అన్ని పార్టీల నాయకులు, ప్రజలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. సింగరేణి సంస్థను ఆదానీ, అంబానీలకు అమ్మడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కంకణం కట్టుకున్నాయని ఆరోపించారు. సింగరేణిలో 900 కోట్ల టన్నుల బొగ్గు నిక్షేపాలు ఉండడంతోనే పెట్టుబడిదారులకు అమ్ముకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి చీకటి ఒప్పందం కుదుర్చుకున్నాయన్నారు. సింగరేణి ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ సింగరేణి కార్మికులు, ప్రజలు ముందుకు రావాలన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీరయ్య, చుక్క రామయ్య, భూపాల్, నాగరాజు, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిపై విమర్శలు చేస్తే సహించేది లేదు



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 29: బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్‌పై కాంగ్రెస్ పార్టీ నాయకులు విమర్శలు చేయడం మానుకోవాలని బీజేపీ పెద్దపల్లి పార్లమెంట్ కన్వీనర్ నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు పట్టి వెంకటకృష్ణ, దుర్గం అశోక్‌లు పేర్కొన్నారు. సోమవారం మంచిర్యాలలో పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల కాంగ్రెస్ నాయకులు బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లిపై చేసిన తప్పుడు ఆరోపణలను ఖండిస్తున్నామన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో మంచిర్యాల జిల్లాకు నిధులు రాక జిల్లాకు అన్యాయం జరిగిందని, ముగ్గురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నా నిధులు ఎందుకు తీసుకు రావాలని రఘునాథ్ ప్రశ్నించినందుకు ఆయనపై పరుష పదజాలంతో దూషించడం సిగ్గుచేటన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం జిల్లాకు చంద్రపూర్-మంచిర్యాల, నాగపూర్-విజయవాడ, ఆర్మూర్ - మంచిర్యాల జాతీయ రహదారుల నిర్మాణానికి వేల కోట్లు మంజూరు చేసిందన్నారు. నాయకులు తిరుపతి, శ్రీదేవి, మధు, రమణరావు, మల్లేష్, లచ్చన్న, మల్లేష్, జయరాం, రాజు,ప్రవీణ్, సతీష్‌రావు, రాంచందర్, అశోక్, రవి, శ్రీనివాస్,చక్రవర్తి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

తల్లడిల్లిన తల్లిప్రేమ



చనిపోయిన ఆవు వద్ద తల్లి ఆవు

జన్నారం, జూలై 29 : మండల కేంద్రంలో ఆదివారం రాత్రి ఓ ద్విచక్ర వాహనం లేగదూడను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ద్విచక్ర వాహనదారుడు కింద పడడంతో గాయాలయ్యాయి. స్థానికులు గాయాలైన వ్యక్తిని ఆసుపత్రికి తరలించారు. తల్లి ఆవు సుమారు గంటన్నర పాటు అరుస్తూ లేగదూడ చుట్టూ తిరుగుతుండడం కలిచివేసింది. స్థానికులను లేగదూడ వద్దకు రాకుండా అడ్డుకొంది. సోమవారం ఉదయం గ్రామపంచాయతీ కార్యదర్శి రాహుల్ గ్రామంలోని ప్రధాన రహదారులపై ఉండే ఆవులను తీసుకువెళ్లకుంటే వాటిని బంజరు దొడ్డికి తరలిస్తామని ఆటోలో ప్రచారం చేయించారు. బంజారు దొడ్డికి తరలించే వాటి యజమానులకు రూ.వెయ్యి జరిమానా విధిస్తారని ప్రచారం చేయించారు.

విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలి

కన్నెపల్లి, జూలై 29: రాష్ట్ర బడ్జెట్‌ను సవరించి విద్యారంగానికి 30 శాతం నిధులు కేటయించాలని ప్రోగ్రెసివ్ యూత్ లీగ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు మనోహర్ పేర్కొన్నారు. సోమవారం మెట్‌పల్లిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యారంగానికి 7.31 శాతం నిధులు కేటయించిందని, దీంతో విద్యారంగం ఏ విధంగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గురుకులాలకు, వసతి గృహాలకు సొంత భవనాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వెంటనే బడ్జెట్‌ను సవరించి విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సిద్దార్థ, అజయ్, వినోద్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

పులుల సంరక్షణ అందరి బాధ్యత





జన్నారం, నెన్నెలలో ర్యాలీ నిర్వహిస్తున్న అటవీ అధికారులు

నెన్నెల, జూలై 29: జాతీయ జంతువు పెద్దపులిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని కుశ్నపల్లి అటవీ క్షేత్రాధికారి గోవింద్‌చంద్ సర్దార్ అన్నారు. అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని సోమవారం నెన్నెలలో నిర్వహించారు. గ్రామంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. అంతరించి పోతున్న జీవజాతుల్లో పెద్ద పులి ఒకటన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పెద్దపులుల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నాయని, అలాంటి పెద్దపులిని కాపాడుకోవాలన్నారు. పెద్దపులి సంరక్షణకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపడుతుందన్నారు. డిప్యూటీ రేంజర్ లక్ష్మీనారాయణ, ఎఫ్ఎస్‌వోలు మల్లయ్య, రాజేష్, శ్రీలత, ఎఫ్‌బీవోలు శ్రీనాథ్, శంకర్, కృష్ణ పాల్గొన్నారు. ఆవడంలో సెక్షన్ ఆఫీసర్ విజయలక్ష్మి, ఎఫ్‌బీవో రాజేశ్వరి ఆధ్వర్యంలు పలు కార్యక్రమాలు నిర్వహించారు.

జన్నారం: అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలో అటవీ శాఖ అధికారులు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం విలేకరులను అటవీ ప్రాంతంలోకి తీసుకువెళ్లి అభివృద్ధి పనులపై వివరించారు. తాళ్లపేట, ఇందన్‌పల్లి ఎఫ్ఆర్‌వోలు సుష్మారావు, హఫీజుద్దీన్‌లు మాట్లాడుతూ కవ్వాల టైగర్ జోన్ వల్ల స్థానిక అటవీ అభివృద్ధి చెందుతుందని, అదే విధంగా వన్య ప్రాణుల సంరక్షణ జరుగుతుందని, అందరు సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: పులులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎఫ్ఎస్‌వో విజయలక్ష్మీ పేర్కొన్నారు. పొన్నారంలో పులుల సంరక్షణపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ వన్యప్రాణులైన జింకలు, పులులు తదితర వాటికి హానీ చేయవద్దన్నారు. అడవులను నరుకుతుండడంతో వన్యప్రాణులు గ్రామాల్లోకి వస్తున్నాయన్నారు. అడవుల్లో ఎవరు కూడా ఉచ్చులు, కరెంటు తీగలు అమర్చవద్దని సూచించారు. బీట్ ఆఫీసర్ రమేష్, ఫీల్డ్ అసిస్టెంట్ ఈద లింగయ్య పాల్గొన్నారు.

సెల్లార్‌లోని దుకాణాలను ఖాళీ చేయాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్

ఏసీసీ, జూలై 29: మంచిర్యాల, నస్పూర్‌లో సెల్లార్‌లో నిర్మించిన వ్యాపార సముదాయాలను ఖాళీ చేయాలని నస్పూర్ మున్సిపల్ చైర్మన్ సుర్మిళ్ల వేణు, మంచిర్యాల మున్సిపల్ వైస్‌చైర్మన్ సల్ల మహేష్ అన్నారు. సోమవారం ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఢిల్లీలోని ఓ కాంప్లెక్స్ సెల్లార్‌లో వరద నీరు చేరి ముగ్గురు మృతిచెందిన ఘటనపై ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు స్పందించి మంచిర్యాల, నస్పూర్ పట్టణాల్లో షాపింగ్ కాంప్లెక్స్‌లు, వాణిజ్య సముదాయాల్లో సెల్లార్‌లను పార్కింగ్‌కు వాడకుండా గదులు నిర్మించి అద్దెకు ఇచ్చారని, వాటిని వెంటనే ఖాళీ చేయాలని వ్యాపారులకు సూచించారన్నారు. సెల్లార్‌లను వ్యాపారాలకు ఉపయోగించడం వల్ల ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందన్నారు. వ్యాపారులు, గుమాస్తాలు వారి వాహనాలను రోడ్డుపై నిలపడంతో కొనుగోలు దారులు రోడ్లపై పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ సమస్య జఠిలంగా మారిందన్నారు. 92 మంది వ్యాపారులు, భవనాల యజమానులకు మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేశారని తెలిపారు. వ్యాపారులందరు సహకరించాలని కోరారు. కౌన్సిలర్ వేములపల్లి సంజీవ్, సత్యనారాయణ, పూదరి తిరుపతి, తూముల నరేష్, కౌన్సిలర్ బానేష్ పాల్గొన్నారు.

విద్యార్థుల మృతి బాధాకరం



మృతుల చిత్రపటాల వద్ద సంతాపం తెలుపుతున్న కొక్కిరాల సురేఖ

ఏసీసీ, జూలై 29: సివిల్స్ పరీక్షలకు సిద్ధమవుతున్న ముగ్గురు వరద నీటిలో దుర్మరణం చెందడం బాధాకరమని డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అన్నారు. ఢిల్లీలోని రావ్స్ కోచింగ్ సెంటర్‌లోని సెల్లార్‌లో వరద నీటిలో మునిగి మృతిచెందిన తాన్యసోని, నవీన్, శ్రేయాయాదవ్‌ల చిత్ర పటాలకు సోమవారం ఎమ్మెల్యే నివాసంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. సురేఖ మాట్లాడుతూ మృతుల్లో శ్రీరాంపూర్ సింగరేణి అధికారి విజయ్‌కుమార్ కూతురు సోని ఉండడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

చెన్నూరు: ఢిల్లీలో ఐఏఎస్ కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థులు సెల్లార్‌లోని వరద నీటితో మృతిచెందడం బాధాకరమని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. సోమవారం చెన్నూరులోని బీజేపీ కార్యాలయంలో మృతి చెందిన ముగ్గురు విద్యార్థుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి ఆత్మకు శాంతిచేకూరాలని మౌనం పాటించారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న కలవేన శంకర్

నస్పూర్, జూలై 29: ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం చేస్తామని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్ అన్నారు. స్థానిక నర్సయ్య భవన్‌లో సోమవారం పట్టణ కార్యదర్శి మిర్యాల రాజేశ్వర్‌రావు అధ్యక్షతన పట్టణ కౌన్సిల్ సమావేశం జరిగింది. శంకర్ మాట్లాడుతూ పార్టీని బలోపేతం చేయడానికి నూతన కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నూతనంగా ఎన్నికైన కమిటీలు ప్రజలకు అందుబాటులో ఉంటూ వివిధ వర్గాల ప్రజలను చైతన్యవంతులుగా చేయాలని సూచించారు. వచ్చే నెల 10న జిల్లా నిర్మాణ కౌన్సిల్ సమావేశం ఉంటుందన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, నాయకులు జోగుల మల్లయ్య, లింగం రవి, మేకల దాసు, కారుకూరి నగేష్, పాల్గొన్నారు. సీపీఐ నస్పూర్ పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. పట్టణ కార్యదర్శిగా మిర్యాల రాజేశ్వర్ రావు, సహాయ కార్యదర్శులుగా తంగళ్ళపల్లి సురేష్, దొడ్డిపల్లి రవీందర్, కోశాధికారిగా గుడెల్లి రాజయ్య ఎన్నుకున్నారు.

సమస్యలు పరిష్కరించాలి




పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

బెల్లంపల్లి, జూలై 29: పెర్కపల్లి గ్రామ సమస్యలు పరిష్కరించాలని గ్రామస్థులు సోమవారం పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. గ్రామస్థులు మాట్లాడుతూ గ్రామంలో పారిశుధ్య పనులు కొనసాగడం లేదని, వీధి దీపాలు వెలగడం లేదన్నారు. పంచాయతీ స్పెషల్ ఆఫీసర్, మండల పంచాయతీ అధికారి గ్రామంలోని సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. దోమల నివారణ మందులను స్ప్రే చేయడం లేదని, చెత్తను సేకరించే వాహనం రావడం లేదని పేర్కొన్నారు. అధికారులు అందుబాటులో ఉండడం లేదని, ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయడం లేదన్నారు. గ్రామంలోని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఐఏఎస్ స్మితా సబర్వాల్‌ను బర్తరఫ్ చేయాలి

మందమర్రి టౌన్, జూలై 29: దివ్యాంగుల గురించి అనుచిత వ్యాఖ్యలు చేసిన కలెక్టర్ స్మితా సబర్వాల్‌ను బర్తరఫ్ చేయాలని సీపీఐ కార్యదర్శి తమ్మినేని వీరభద్రంకు దివ్యాంగుల పోరాట సమితి నాయకుడు పెద్దపల్లి సత్యనారాయణ వినతిపత్రం సమర్పించారు.









మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

దండేపల్లి,జూలై 29: తాళ్ళపేట నిరుపేద కుటుబానికి చెందిన అడప మల్లేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. వారిది నిరుపేద కుటుంబం కావడంతో మాజీ వైస్ఎంపీపీ ఆకుల రాజేందర్ కుటంబ సభ్యులను పరామర్శించి రూ.5వేల ఆర్థిసాయం అందజేశారు.







అలంకారప్రాయంగా క్రీడా ప్రాంగణాలు

హాజీపూర్, జూలై 29: బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రణాళిక లేకుండా ఏర్పాటు చేసిన తెలంగాణ క్రీడా ప్రాంగణాలు అలంకార ప్రాయంగా మారాయని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎనగందుల కృష్ణమూర్తి పేర్కొన్నారు. సోమవారం నర్సింగాపూర్‌లోని క్రీడా ప్రాంగణాన్ని సందర్శించి మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం గుట్టల పక్కన, తుమ్మ చెట్ల మధ్యన క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేసి ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసిందన్నారు. ఈ క్రీడా ప్రాంగణాలు పనికి రాకుండా పోయాయన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలను ఉపయోగంలోకి తేవాలని, ఎంత భూమి కేటాయించారు, బడ్జెట్ ఎంత అయ్యిందనే వివరాలతో కూడిన బోర్డులను ఏర్పాటు చేయాలని కోరారు. బీజేపీ మండల అధ్యక్షుడు గడ్డం స్వామిరెడ్డి, నాయకులు తిరుపతి, మాధవరపు వెంకటరమణరావు, మడిపెల్లి సత్యం, ప్రశాంత్, మల్లేష్, శ్రీనివాస్, రాజనర్సు, సురేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.


నర్సింగాపూర్‌లోని క్రీడా ప్రాంగణం వద్ద బీజేపీ నాయకులు





సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

కాసిపేట, జూలై 29: మండంలోని పలువురు లబ్ధిదారులకు సోమవారం మండలకేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్ సీఎంసహాయనిధి చెక్కులను అందజేశారు. 8మందికి రూ.2,10,500 సీఎంసహాయనిధి చెక్కులను పంపిణీచేశామన్నారు. నాయకులు రౌతు సత్తయ్య,రాజమౌళి,సిరాజ్‌ఖాన్,మేరుగు శ్రీనివాస్, షైదం రమేష్, రవి, స్వామి తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 29 : మలేషియాలో ఆగస్టు6న జరిగే అంతర్జాతీయ సదస్సుకువెళ్తున్న బోడధర్మేందర్‌ను సోమవారం ఎస్‌బీఐ లైఫ్ఇన్సూరెన్స్ కార్యాలయంలో బ్రాంచ్‌మేనేజర్ షైడయ్య సన్మానించారు. మేనేజర్ మాట్లాడుతూ అత్యుత్తమ బిజినెస్ చేసినందుకు ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్‌మంచిర్యాల బ్రాంచ్‌నుంచి బోడధర్మేందర్ మలేషియాకు ఎంపికచేసిందన్నారు. అసిస్టెంట్‌మేనేజర్‌లక్ష్మీనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏబీపీపీ జాతీయప్రధాన కార్యదర్శిగా తిరుమల్‌రావు

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 29: అఖిలభారతీయఅయ్యప్ప ధర్మ ప్రచారసభ(ఏబీపీపీ) జాతీయప్రధాన కార్యదర్శిగా మంచిర్యాలకు చెందిన బేతి తిరుమల్‌రావు నియమితులయ్యారు. అలాగేరాష్ట్ర ఉపాధ్యక్షునిగా మట్టుపల్లి సంపత్‌రావు, ఈసీ మెంబర్‌గా శివారెడ్డిలు ఎన్నికయ్యారు. ఈ నెల28నఖమ్మంలో జరిగినసమావేశంలో జాతీయఅధ్యక్షుడు అయ్యప్ప దాస్ వీరిని ఎన్నుకున్నారు.

పాము కాటుతో యువతి మృతి

మందమర్రిటౌన్, జూలై 29: పట్టణంలోని రెండవ జోన్‌కు చెందిన దురిశెట్టి సాధన(19) సోమవారం సాయంత్రం పాముకాటుతో మృతి చెందింది. సాధన ఇంట్లో బల్లమీద పడుకుని ఉండగా ఇంట్లోకి వచ్చిన పాము కాటువేసింది. గమనించిన సాధన తన సోదరునికి చెప్పడంతో వెంటనే మంచిర్యాలలోని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందింది. డిగ్రీపూర్తిచేసిన సాధన ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధమవుతోంది. ఇటీవల పెళ్లి కూడా నిశ్చయమైంది. చుట్టుపక్కల చెట్ల పొదలు, డ్రైనేజీ ఉండడంతోనే ఇంటిలోకి పాము వచ్చిందని స్థానికులు తెలిపారు. సాధనమృతితో కాలనీలోవిషాధం అలుముకుంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.





గుడుంబా మత్తులో కొడుకుపై దాడి

● చికిత్స పొందుతూ మృతి



అబ్బార్ల శేఖర్ (ఫైల్)

నెన్నెల, జూలై 29: గుడుంబా మత్తులో మానవత్వం మరిచిన తల్లిదండ్రులు కొడుకునే హతమార్చారు. నిద్రలో ఉన్న కుమారుడిని తల్లి కదలకుండా పట్టుకోగా తండ్రి కొడవలితో పొట్టపై నరికాడు. అడ్డుపెట్టిన చేతిపై వేటు వేసి చనిపోయాడని భావించి పారిపోయారు. మండల కేంద్రంలోని పోశమ్మవాడలో నాలుగు రోజుల కిందట చోటు చేసుకోగా తీవ్రంగా గాయపడిన కొడుకు అబ్బార్ల శేఖర్ (24) చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. అబ్బార్ల విజయ్-పద్మకు ముగ్గురు కొడుకులు. నాటుసారకు బానిసైన దంపతులు రోజు కొడుకులతో గొడవ పడేవారు. ఈ నెల 25న రాత్రి సారా కోసం డబ్బులు ఇవ్వాలని చిన్న కొడుకు అశోక్‌తో గొడవపడ్డారు. తాము చెప్పినట్లు వినడం లేదని అశోక్‌ను అదే రాత్రి హతమార్చాలనుకున్నారు. కరెంటు కట్ చేసి చీకట్లో అశోక్ అనుకొని పెద్దకొడుకు శేఖర్‌పై దాడి చేశారు. శేఖర్ కాళ్లను తల్లి పట్టుకోగా తండ్రి కొడవలితో నరికాడు. శేఖర్ స్పృహ కోల్పోవడంతో మృతి చెందాడనుకొని పారిపోయారు. మరుసటి రోజు ఉదయం రక్తపుమడుగులో పడిఉన్న శేఖర్‌ను గమనించిన పొరుగు వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి శేఖర్ మృతి చెందాడు. నిందితులైన విజయ్, పద్మలను రిమాండ్‌కు తరలించామని ఎస్సై ప్రసాద్ తెలిపారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

లక్షెట్టిపేటరూరల్, జూలై 29: పట్టణంలోని గోదావరి రోడ్డు రాంనగర్‌కు చెందిన గాధనవేని తిరుపతి (25) అనే యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తిరుపతి ఇంటర్ వరకు చదివి సెంట్రింగ్ పని చేస్తున్నాడు. సోదరుడు ఆర్మీలో ఉద్యోగం చేస్తుండగా తిరుపతి కూడా రెండు సార్లు ఆర్మీ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకుని రన్నింగ్‌లో క్వాలిఫై కాలేకపోయాడు. దీంతో ఉద్యోగం లేదని బాధపడుతుండేవాడు. ఆదివారం రాత్రి కుటుంబ సభ్యులు ఓదార్చగా గదిలోకి వెళ్లి పడుకున్నాడు. సోమవారం ఉదయం తలుపులు కొట్టినా తీయకపోవడంతో తలుపులు పగులగొట్టి చూడగా ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి కొమురయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు.

ఉద్యోగం పేరుతో మోసగించిన ఇద్దరి అరెస్టు

మంచిర్యాల అర్బన్, జూలై 29: పట్టణానికి చెందిన బేర నగేష్‌కుమార్ ఉద్యోగం పేరుతో మోసగించిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ బన్సీలాల్ తెలిపారు. సోమవారం ఆయన వివరాలను వెల్లడించారు. సోమగూడెంకు చెందిన సింగరేణి ఉద్యోగి విష్ణుప్రసాద్ తనకు వరంగల్‌కు చెందిన దాసు హరికిషన్ అనే వ్యక్తి తెలుసని, అతనికి సింగరేణి సంస్థలో పరిచయలు ఉన్నాయని, నగేష్‌కుమార్ భార్యకు ఉద్యోగం పెట్టిస్తానని రూ.15లక్షలకు బేరం కుదుర్చుకున్నాడని తెలిపారు. ఒప్పందంలో భాగంగా రూ.5లక్షలను మొదటి విడుతగా విష్ణు ద్వారా హరికిషన్‌కు 2022లో అందజేశాడని తెలిపారు. ఉద్యోగం కల్పించకపోవడంతో బాధితుడు వారిని నిలదీయగా హరికిషన్, విష్ణులు తనకు ఏం సంబంధం లేదనడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడని తెలిపారు. హరికిషన్‌పై భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2 నెలల క్రితం 8 చీటింగ్ కేసులు నమోదై జైలుకు వెళ్లినట్లు విచారణలో తెలిందని సీఐ తెలిపారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

మందమర్రిటౌన్, జూలై 29: పట్టణంలోని మూడో జోన్‌కు చెందిన దాసరి శంకర్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న అతని పదో తరగతి మిత్రులు రూ. 26 వేల ఆర్థిక సహాయాన్ని సోమవారం శంకర్ కుటుంబీకులకు అందజేశారు. స్నేహితులు రవికుమార్, శ్రీనివాస్, శ్రీధర్, చంద్రమోహన్, కుమార్, చారి పాల్గొన్నారు.

అన్నదానం

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 29: సింగరేణి సీఎండీ బలరాం పుట్టిన రోజు సందర్భంగా సింగరేణి విశ్రాంత కార్మిక సంఘం నాయకులు సోమవారం జిల్లా కేంద్రంలోని ఏకలవ్య ఆశ్రమంలో అన్నదాన నిర్వహించారు. అనంతరం మొక్కలు నాటారు. గజెల్లి వెంకటయ్య, రాజన్న, లచ్చన్న, జ్ఞాని, కృష్ణ, రాంరెడ్డి, శ్రీనివాస్, నర్సింహారావు, ఆనందరావు పాల్గొన్నారు.

ఈ వసతి మాకొద్దు...

- శిథిలావస్థకు చేరిన వసతి గృహం
- గదుల్లోకి చేరుతున్న నీరు, గోడలకు కరెంటు షాక్
- ఇంటి దారి పట్టిన విద్యార్థులు



ఊడిపోయిన పైకప్పు పెచ్చులు, ఇంటి దారి పడుతున్న విద్యార్థులు

కోటపల్లి, జూలై 29: మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహం శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులు భయాందోళనలకు గురవుతున్నారు. ఈ వసతిగృహం మాకొద్దు అంటూ ఇంటి దారి పడుతున్నారు. ఎస్సీ బాలుర వసతి గృహం 50 సంవత్సరాల క్రితం నిర్మించారు. పది రోజులుగా కురుస్తున్న వర్షాలకు భవనం ఉరుస్తూ నీరు గదుల్లోకి చేరడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వసతి గృహంలో 135 మంది విద్యార్థులు ఉన్నారు. గదుల పైకప్పు పెచ్చులు ఊడి ఉరుస్తోంది. కిచెన్ రూమ్ మొత్తం నీటితో నిండి ఉండగా గోడలు, పైకప్పు తడిసిపోయింది. ఒక్క గది సరుకుల నిల్వకు పోగా మిగితా ఐదు గదుల్లో ఒక్కో గదిలో 25 నుంచి 30 మంది విద్యార్థులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. వర్షాలతో తడిసిన గోడలకు కరెంటు షాక్ వస్తుండడం ఆందోళనకు గురి చేస్తుంది. భవనం పరిస్థితిపై గతంలో అధికారులు, నాయకులకు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయిందని, ప్రమాదం జరిగితే కానీ పట్టించుకోరా అని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. రెండు రోజుల్లో విద్యార్థులందరూ ఇండ్లకు వెళ్లిపోయారు. చెన్నూరు ఎమ్మెల్యే, కలెక్టర్ స్పందించాలని పలువురు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి

- మల్లేష్, వసతి గృహం ఇన్‌చార్జ్ వార్డెన్

వసతి గృహంలో నెలకొన్న సమస్యలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాను. ఏఎస్‌డబ్ల్యూవో, డిప్యూటీ డైరెక్టర్‌లు వసతి గృహాన్ని సందర్శించారు. కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. త్వరలోనే విద్యార్థుల చదువుకు ఆటంకం ఏర్పడకుండా ప్రత్యామ్నాయ చర్యలపై దృష్టి పెడతామని అధికారులు పేర్కొన్నారు.

రాహుల్‌గాంధీని కలిసిన ఎమ్మెల్యే



బెల్లంపల్లి, జూలై 29: ఢిల్లీలోని పార్లమెంట్ హౌస్ చాంబర్‌లో ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీని సోమవారం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌వెంకటస్వామి మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించారు.

కన్నెపల్లి పశువైద్యాధికారిగా రామకృష్ణ



బాధ్యతలు స్వీకరిస్తున్న పశువైద్యాధికారి

కన్నెపల్లి, జూలై 29: మండలంలోని జన్కాపూర్ పశు వైద్యశాలలో సోమవారం పశువైద్యాధికారిగా రామకృష్ణ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన పశువైద్యాధికారి హరిక బదిలీపై వెళ్లడంతో తిర్యాణి నుంచి బదిలీ పై రామకృష్ణ కన్నెపల్లికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు సిబ్బంది స్వాగతం పలికారు.

పోస్టాఫీస్‌లో ఖాతాదారుల సమావేశం



ఖాతాను అందిస్తున్న అసిస్టెంట్ సూపరింటెండెంట్

నస్పూర్, జూలై 29: సీసీసీ టౌన్‌షిప్ పోస్టాఫీస్‌లో సోమవారం డక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (డీసీడీపీ) కార్యక్రమాన్ని పోస్టల్ అధికారులు నిర్వహించారు. సమావేశానికి 106 మంది హాజరు కాగా ఇందులో 70 మంది ఖాతాలను తెరిచారు. పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రామారావు ముఖ్య అతిథిగా హాజరై ఖాతాదారులకు పోస్టల్ స్కీమ్‌లను వివరించారు. ఖాతాదారులకు వివిధ స్కీమ్ పట్ల అవగాహన కల్పించారు. పోస్టల్ అధికారులు శ్రావన్, భరత్, సబ్‌పోస్ట్‌మాస్టర్ హతిఫ్, బ్రాంచీ పోస్టుమాస్టర్లు సుమలత, శేఖర్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం మండల కమిటీ

చెన్నూరు, జూలై 29: చెన్నూరులోని ఆర్యవైశ్య సంఘం భవనంలో సోమవారం మండల ఆర్యవైశ్య సంఘం కమిటీని ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు ముక్త శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా చిలువేరు మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శిగా నరేందర్, కోశాధికారిగా హరీష్‌కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ట్రస్మా నస్పూర్ పట్టణ కమిటీ



ప్రమాణ స్వీకారం చేస్తున్న కార్యవర్గం

నస్పూర్, జూలై 29: తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ట్రస్మా) పట్టణ సమావేశం సోమవారం సీసీసీ కార్నర్‌లో ఒక పాఠశాలలో జరిగింది. ట్రస్మా జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లెత్తుల రాజేంద్రపాణి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రేగళ్ల ఉపేందర్‌ల సమక్షంలో పట్టణ కమిటీని ప్రకటించారు. పట్టణ అధ్యక్షుడిగా మైదం రామకృష్ణ (ఎయిమ్స్ స్కూల్), ప్రధాన కార్యదర్శిగా ఊట్ల సత్యనారాయణ (లిటిల్ రోబోస్), కోశాధికారిగా అంబాల రాజ్‌కుమార్ (సృష్టి), ఉపాధ్యాక్షుడిగా చెన్నూరి అమన్ ప్రసాద్ (రెయిన్‌బో)లతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్ను కున్నారు. అధ్యక్షుడు మైదం రామకృష్ణ మాట్లాడు తూ ప్రైవేట్ పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు.

ఓసీపీని సందర్శించిన డీసీపీ



మందమర్రిటౌన్, జూలై 29: మందమర్రి ఏరియాలోని కేకే ఓసీపీని డీసీపీ భాస్కర్ సోమవారం సందర్శించారు. డీసీపీకి జీఎం మనోహర్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. బొగ్గు ఉత్పత్తి వివరాలను జీఎం వివరించారు. వర్షాలు కురుస్తున్నందున కొంత బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలుగుతుందని తెలిపారు. డీసీపీని జీఎం శాలువాలతో సన్మానించారు. ఎస్‌వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకే కమ్యూనిటీ కాంటాక్టు ప్రోగ్రాం



హాజీపూర్‌లో మాట్లాడుతున్న ఏసీపీ, వేమనపల్లిలో పోలీసుల తనిఖీలు

హాజీపూర్, జూలై 29: శాంతిభద్రతల పరిరక్షణకే కమ్యూనిటీ కాంటాక్టు ప్రోగ్రాం నిర్వహిస్తున్నామని ఏసీపీ ప్రకాష్ పేర్కొన్నారు. సోమవారం దొనబండలో కమ్యూనిటీ కాంటాక్టు ప్రోగ్రాం నిర్వహించారు. సరైన ధ్రువపత్రాలు లేని 32 బైక్‌లు, 1 ఆటోను సీజ్ చేశారు. ఏసీపీ మాట్లాడుతూ ప్రజల రక్షణ, భద్రత పోలీసులు ధ్యేయమన్నారు. గ్రామాల్లోకి ఎవరైనా కొత్త వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కాలనీల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. యువత మత్తు పదార్థాలు, గంజాయికి దూరంగా ఉండాలన్నారు. చెడు అలవాట్లకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ఏదైనా సమస్య ఉన్నా, అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100కు, స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఎస్ఐలు నరేష్‌కుమార్, సురేష్, సుగుణాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

వేమనపల్లి: మావోయిస్టు అమరవీరుల వారోత్సవాల నేపథ్యంలో సోమవారం మంగెనపల్లి ఎక్స్ రోడ్డు వద్ద నీల్వాయి ఎస్ఐ శ్యామ్‌పటేల్ ఆధ్వర్యంలో విస్తృతంగా వాహనాలను తనిఖీలు చేశారు. వాహనదారుల వివరాలను తెలుసుకున్నారు. ఎస్ఐ మాట్లాడుతూ ఈ నెల 28 నుంచి ఆగస్టు 3 వరకు మావోయిస్టు అమరవీరుల వారోత్సవాలు ఉన్నందున తనిఖీలను చేపడుతున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానస్పదంగా కనిపించినట్లయితే ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

'గోండి భాషను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలి'

సిర్పూర్(యు), జూలై 29: గోండిభాషను రాజ్యాంగంలోని 8వ షేడ్యూల్ చేర్చాలని అఖిలభారతీయ గోండ్వానగోండ్ మహాసభ జాతీయ ఉపాధ్యక్షుడు ఆర్క. మానిక్‌రావు కేంద్రప్రభుత్వాన్ని కోరారు. సోమవారం మహారాష్ట్ర నాగ్‌పూర్‌లోని గోండ్వానభవన్‌లో జాతీయ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని 18రాష్ట్రాల్లో గోండిభాష మాట్లాడే వారు ఉన్నారన్నారు. కోయపున్నెం రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఆత్రం ఆనంద్‌రావు మాట్లాడుతూ వచ్చేజనగణనలో ఆదివాసీలకు ప్రత్యేకకాలం ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు కొరెంగ దౌలత్‌రావు మాట్లాడుతూ ఆదివాసీలకు విద్య, వైద్య, ఆరోగ్యం, ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో చత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, జార్ఖండ్, అస్సాం, మధ్యప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్ తదితర రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు. తెలంగాణ నుంచి రాజ్‌గోండ్ సేవాసమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంగం విషంరావు, కోయ పున్నెం రాష్ట్ర నాయకులు కోట్నాక కోశారావు, మడావి శేషారావు,ఉయక శ్యాంరావు,శంకర్,మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీ సహజం'

సిర్పూర్(టి), జూలై 29: ప్రభుత్వఉద్యోగులకు బదిలీలు సహజమని మాజీ సర్పంచ్ సయ్యద్ కిజర్‌హుస్సేన్ అన్నారు. పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తి మంచిర్యాలకు బదిలీకావడంతో సోమవారం గ్రామపంచాయతీ మాజీపాలక వర్గ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు మహేష్, అఖీల్, ఇప్తుతుస్సేన్, సంతోష్, అనీల్‌కుమార్ తదితరులున్నారు.

జలపాతం వద్దకి వెళ్లొద్దు



సూచనలు చేస్తున్న ఎఫ్ఆర్వో ప్రవీణ్‌కుమార్

తిర్యాణి, జూలై 29: మండలంలోని చింతలమాదర జలపాతంలోనికి ఎవరు కూడా వెళ్లరాదని గిన్నెధరి ఎఫ్ఆర్వో ప్రవీణ్‌కుమార్ సూచించారు. జలపాతం సందర్శనకు వచ్చేప్రజలు ఉదయం 10నుంచి సాయంత్రం 4గంటల వరకు మాత్రమే ఉండాలన్నారు. ఆ తరువాత ఎవరూ కూడా జలపాతం సందర్శన కోసం వెళ్లవద్దన్నారు. రక్షణ నిమిత్తం ఏర్పాటు చేసిన కంచెను దాటకూడదన్నారు. జాగ్రత్తలు తీసుకుని జలపాతం సందర్శించి ప్రకృతిని ఆస్వాదించి వెళ్లాలని అన్నారు.

మళ్లీ ఉప్పొంగిన ప్రాణహిత

● జలదిగ్బంధంలో తలాయి, తిక్కపల్లి, భీమారం గ్రామాలు

బెజ్జూరు, జూలై 29: మండల ప్రజలకు మళ్లీ ఇబ్బందులు మొదలయ్యాయి. మహారాష్ట్ర ఎగువ ప్రాంతంలో ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేయడంతో ప్రాణహితకు సోమవారం భారీగా వరదనీరు పోటెత్తుతోంది. దీంతో తిక్కపల్లి, భీమారం, తలాయి గ్రామాలు మళ్లీ జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ప్రధానరోడ్లపై భారీగా ప్రాణహిత బ్యాక్‌వాటర్ చేరడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రాణహితవరదల కారణంగా ఇప్పటికే సుమారు మండలంలో 1500ఎకరాలకు పైగా పంటలు పూర్తిగా నష్ట పోయినట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



తలాయి- తిక్కపల్లి రోడ్డుపై ప్రవహిస్తున్న ప్రాణహిత బ్యాక్‌వాటర్

పులుల రక్షణతోనే వాతావరణ సమతుల్యత



కాగజ్‌నగర్‌లో బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న అటవీశాఖ అధికారులు, సిబ్బంది



జైనూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న అటవీశాఖ అధికారులు

ఆసిఫాబాద్ రూరల్, జూలై 29: పులుల సంరక్షణతోనే వాతావరణ సమతుల్యత సాధ్యమవుతుందని ఆసిఫాబాద్ డిప్యూటీరేంజ్ అధికారి యోగేష్ తెలిపారు. జిల్లాకేంద్రంలో అటవీశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోడుసాగు వల్ల అటవీవిస్తీర్ణం తగ్గడంతో పులుల సంరక్షణ కష్టంగా మారిందన్నారు. కవ్వాల్‌టైగర్ రిజర్వ్‌లో గతంతో పోలిస్తే పులుల సంచారం పెరిగిందన్నారు. దీనిని మరింత పెంచాల్సినబాధ్యత ప్రజలపై ఉందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీరేంజ్ అధికారులు సరోజరాణి, రాజేశ్వరచారి, సెక్షన్‌అధికారులు సాయి, లక్ష్మణ్, బీట్‌అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆసిఫాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న అటవీశాఖ అధికారులు,సిబ్బంది

కాగజ్‌నగర్: పట్టణంలో అటవీశాఖ ఆధ్వర్యంలో సోమవారం అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా అటవీశాఖ అధికారులు, సిబ్బంది బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈర్యాలీ పట్టణంలోని పలువీధుల గుండా సాగింది. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సమా వేశంలో ఎఫ్‌డీవో అప్పలకొండ మాట్లాడుతూ పులులను సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పులులను రక్షిస్తే అడవులకు రక్షణ ఉంటుందన్నారు. కార్యక్ర మంలో ఎఫ్ఆర్వో రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం మండలంలోని పలు గ్రామాల్లో కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

జైనూర్: మండలకేంద్రంలోఅంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని సోమవారం అటవీశాఖ అధికారులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాన రొడ్డుపై ప్రజలతో కలిసి వారు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసినకార్యక్రమంలో జిల్లాగ్రంథాలయ చైర్మన్ కనక యాదవ్‌రావ్, ఎఫ్ఆర్వో జ్ఞానేశ్వర్ మాట్లాడుతు అడవులతోనే మానవమనుగడ అని, ప్రతిఒక్కరూ అటవీసంరక్షణకు పాటుపడాలన్నారు. అడవి ప్రాంతం కాపాడుకుంటేనే అన్ని విధాలుగా సభ్య సమాజానికి లాభదాయకంగా ఉంటుందన్నారు. ఈ పందర్భంగా ఆదివాసి సంఘాల జేసి నాయకులు ఆత్రం భీంరావ్ జావిద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సందల్



కాగజ్‌నగర్‌లో సందల్ వేడుక



మొక్కులు తీర్చుకునేందుకు వచ్చిన మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

కాగజ్‌నగర్, జూలై 29: పట్టణంలో సోమవారం తాజుద్దీన్‌బాబా సందల్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మాజీఎమ్మెల్యే కోనేరు కోనప్ప, మాజీ జడ్పీ ఇన్‌చార్జీ చైర్మన్ కోనేరు కృష్ణారావు మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ శంకరయ్య ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీతోపాటు ఇతరపార్టీల నాయకులు కూడా పానీయాలు, ప్రసాదవితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమలో బీఆర్ఎస్ పార్టీ సిర్పూరు నియోజకవర్గ కన్వీనర్ లెండుగురే శ్యాం రావు, రాజ్‌కుమార్‌తోపాటు నాయకులు పాల్గొన్నారు.

వలకు చిక్కిన డెవిల్ ఫిష్



తలాయి ప్రాణహిత వరదలో వలకు చిక్కిన డెవిల్ ఫిష్

బెజ్జూరు, జులై 29: మండలంలోని తలాయివద్ద ప్రాణహిత నదిలో తలాయి గ్రామానికి చెందిన మత్స్యకారుడు పానెం బానయ్య సోమవారం చేపలవేటకు వెళ్లగా అరుదైన డెవిల్ ఫిష్(చేప) వలకు చిక్కింది. ఈ చేప శాస్త్రీయ నామం సూకర్‌ఫిష్‌గా తెలుస్తోంది. వాడుక భాషలో దెయ్యపు చేపగా అభివర్ణిస్తారు. ఎలాంటి మార్కెట్ విలువలేని ఈచేప చెరు వులో చేరిందంటే చాలు ఇక ఆ చెరువులో ఉన్న చేపల్ని మొత్తం తింటుందని పేర్కొంటున్నారు. దీనిని అక్వేరియంలో పెంచే అలంకరణ చేపగా అభివర్ణిస్తారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ప్రాణహిత నదికి వరద పోటెత్తగా ఆ వరదలోనే కొట్టుకవచ్చినట్లు తెలుస్తోంది. 2007లో వచ్చిన వరదల కారణంగా ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తాతీరంలోకి కొట్టుకవచ్చిన ఈ చేపలు అక్కడి చేపల రైతులకు తీరని నష్టాన్ని మిగిల్చాయి. అయితే ఈప్రాంతంలో ఈచేప దొరకడం ఇతే తొలిసారి కావడంతో ఇక్కడిప్రాంత వాసులు అరుదైన చేపగా గుర్తిస్తున్నారు.

తరుచూ ప్రమాదాలు.. అయినా పట్టించుకోరు



గోయగాం వద్ద ఆదిలాబాద్ ప్రధాన రోడ్డుపై ఏర్పడి గుంత

కెరమెరి, జూలై 29: కొన్నిరోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆసిఫాబాద్-ఆదిలాబాద్ ప్రధానరహదారి పూర్తిగా గుంతలమయంగా మారింది. ఈరోడ్డుపై అనేకసార్లు ద్విచక్రవాహనదారులు పడిపోయిన సందర్భాలు ఉన్నాయి. అలాగే కారు, ఆటోలు ఇరుక్కుపోయిన సందర్భాలు సైతం అనేకం ఉన్నాయి. ఆయాగ్రామాల ప్రజలు గుంతలను మట్టి, రాళ్లతో పూడ్చినప్పటికీ ప్రయోజనం లేకుండా పోతోంది. మండలంలోని అంబారావుగూడ, దనోర, సుర్దాపూర్ గ్రామాల మధ్య గోయగాం బ్రిడ్జి వద్ద పెద్ద గుంత ఏర్పడి ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి.

పడమటి సంధ్యారాగం

పెంచికలపేట, జూలై 29: జిల్లావ్యాప్తంగా 15 రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీవర్షాల నేపథ్యంలో సూర్యదర్శనం (సూర్యోదయం) లేకుండా పోయింది. సోమవారం సాయంత్రం సంధ్యా సమయంలో సూర్యుడు పడమర దిక్కులో కనిపించ డంతో పలువురు ఆసక్తిగా తిలకించారు. ఇప్పటికైనా వర్షాలు తగ్గుముఖంపడితే సాగు పనులు ముందుకుసాగుతాయని రైతులు ఆశాభావంవ్యక్తం చేస్తున్నారు.



పెంచికలపేటలో పడమర దిక్కులో కనిపించిన సూర్యుడు

అనారోగ్యంతో ఒకరి మృతి

● అనుమానాలు ఉన్నాయని సోదరుడి ఫిర్యాదు

● కేసు నమోదు చేసిన పోలీసులు

దహెగాం, జూలై 29: మండలకేంద్రానికి చెందిన బండ మల్లేష్ (33) ఆదివారం అనారోగ్యంతో మృతిచెందాడు. కాగామృతుడి సోదరుడు బండ సత్తయ్య.. మల్లేష్ మృతిపై అనుమానాలున్నాయంటూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మల్లేష్ భార్య మంజుల గతంలో మరొకరితో వివాహేత సంబంధం కొనసాగించింది. ఈ విషయంపై భార్యభర్తల మధ్య గొడవజరిగి విడివిడిగా ఉంటున్నారు. ఇదేక్రమంలో భార్య తల్లిగారి ఇంటికి వెళ్లింది. ఈ విషయంలో కుటుంబసభ్యులు కల్పించుకొని ఇద్దరికి సర్ది చెప్పి కలిసుండాలని సూచించారు. కొంతకాలంపాటు కలిసి ఉండగా భార్య పాత కథను పునరావృతం చేయడంతో మల్లేష్ మద్యానికి బానిసై అనారోగ్యం పాలయ్యాడు. ఆదివారం ఉదయం మల్లేష్ ఆరోగ్యపరిస్థితి విషమించడంతో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి సోదరుడు సత్తయ్య తన సోదరుడు మల్లేష్ మృతిపై అనుమానాలు ఉన్నాయని దహెగాం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

సొంత ఖర్చులతో రోడ్డుకు మరమ్మతులు


మరమ్మతులు చేయిస్తున్న బీజేపీ నాయకులు

దహెగాం, జూలై 29: మండలంలోని గెర్రె- గిరివెల్లి- ఖర్జీ గ్రామంవరకు ఉన్న రహదారికి బీజేపీనాయకులు సోమవారం సొంతంగా రూ.1.50లక్షలు సేకరించి మరమ్మతు పనులు చేయించారు. కార్యక్రమంలో పాల్వాయి సుధాకర్ రావు, ధనుంజయ్, తిరుపతిగౌడ్, దామోదర్, సంజీవ్, బక్కన్న తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథ్‌పూర్ వంతెనపై దిగబడిన లారీ


వంతెన వద్ద దిగబడిపోయిన లారీ

కాగజ్‌నగర్, జూలై 29: కాగజ్‌నగర్ అందవెల్లి జగన్నాథ్‌పూర్ వంతెన అప్రోచ్‌రోడ్డుపై సోమవారం ఉదయం లోడ్‌తో వెళ్తున్నలారీ దిగబడిపోయింది. దీంతో రాకపోకలు నిలిచి పోయాయి. గ్రామస్థులు ఎంత ప్రయత్నించినా లారీని బయటకు రాలేదు. దాదాపునాలుగు గంటల వరకు నానా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. చివరకు టైర్లకింద మట్టి, రాళ్లు పోయటంతో లారీ బయటకు రావటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఎకరానికి రూ.20వేల పరిహారం ఇవ్వాలి


నష్టపోయిన పంటలను పరిశీలిస్తున్న బీజేపీ నాయకుడు సుధాకర్‌రావు

చింతలమానేపల్లి,జూలై 29: వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలకు ఎకరానికి రూ.20వేల నష్టపరిహారం ఇవ్వాలని బీజేపీనాయకుడు పాల్వాయి సుధాకర్ రావు డిమాండ్ చేశారు. మండలంలోని దిందా, కేతినిగ్రామాల్లో ప్రాణహిత పరివాహక ప్రాంతాలు, అలాగే దిందా వాగు ఒడ్డున నష్టపోయిన పంటలను ఆయన, ఆపార్టీసభ్యులతోకలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తక్షణమే పంటనష్టం సర్వేనిర్వహించి రైతులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీశైలం, మల్లయ్య, నవీన్, తుకారాం, బాలయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

తాగునీటికి తిప్పలు


కావడితో నీటిని తెచ్చుకుంటున్న కోయవాడ కాలనీవాసుడు

దహెగాం, జూలై 29: మండలకేంద్రం లోని కొత్తపల్లి ప్రాథమిక పాఠశాల సమీపంలోగల చేతిపంపు చెడిపోయింది. దీంతో తాగునీటికి ఇబ్బంది పడుతున్నామని కోయవాడ ప్రజలు వాపోతున్నారు. సమీపకాలనీల్లోకి వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నామని పేర్కొంటున్నారు. కాలనీకి మిషన్ భగీరథనీరు చుక్క రావడం లేదని ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి చేతి పంపు బాగు చేయాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు.

- పంచాయతీ ఎన్నికలపై సీఎం ప్రకటన
- గ్రామాల్లో వేడెక్కుతున్న రాజకీయ వాతావరణం

పల్లెపోరులో కదలిక



వాంకిడి, జూలై 29: పంచాయతీ ఎన్నికలు వీలైనంత త్వరగా నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశం చడంతో జిల్లాలో ఒక్కసారిగా రాజకీయ సందడి నెలకొంది. బీసీ గణన పూర్తయ్యాకే ఎన్నికలు నిర్వహిస్తారన్న కోణంలో ఆలోచించి మరోఆరు నెలలపాటు జరుగవనే అభిప్రాయంతో ఉన్న ఆశావ హుల్లో ప్రభుత్వ నిర్ణయం కదలిక తీసుకువచ్చింది. దీంతో పోటీ చేయడానికి అనుగుణంగా తమ మద్దతుదారులతో సమాలోచనలకు తెరతీయడంతో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది.

● కొనసాగుతున్న ప్రత్యేక అధికారుల పాలన

అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నూతన పంచాయతీరాజ్ చట్టం 2018 అమలులోకి తీసుకువచ్చి 2019లో సర్పంచి ఎన్నికలను నిర్వ హించింది. జనవరి1న ఎన్నికల షెడ్యూల్, నోటిఫికేషన్ వెలువడింది. జనవరి 21,25,30తేదీల్లో మూడు దశల్లో పార్టీ రహితంగా ఎన్నికలు నిర్వహించారు. ఫిబ్రవరి1న సర్పంచులు, వార్డు సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. 2024ఫిబ్రవరి1తో పదవీకాలం ముగియడంతో జిల్లా లోని 335పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన కొసాగుతోంది. 2018 ఆగస్టులో రాష్ట్రంలో తొలిసారిగా గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన వచ్చింది. 2019జనవరి వరకు ఆరునెలల పాటు కొసాగింది. ఆతర్వాత రాష్ట్రంలో ప్రత్యేకపాలన రావడం రెండోసారి.

● వాస్తవానికి గతంలోనే ఏర్పాట్లు..

గతేడాది డిసెంబరులోనే సర్పంచి ఎన్నికలకు రిటర్నింగ్ అధికా రులు, ప్రిసైడింగ్, పోలింగ్ అధికారులు, సిబ్బందిని నియమించాలని రాష్ట్రం ఎన్నికల సంఘం ఆదేశాలను జారీచేసింది. లోక్‌సభ ఎన్నికలు రావడంతో ఆప్రక్రియ నిలిచిపోయింది. ప్రస్తుతం సర్పంచుల ఎన్ని కలు నిర్వహించేందుకు మొదట ఓటరుజాబితా సవరణపై దృష్టి సారించనున్నారు. ఆగస్టు మొదటివారంలోగా ఓటరు జాబితా సిద్ధం చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

- 200మంది ఓటర్లకు ప్రిసైడింగ్ అధికారితోపాటు పోలింగ్ అధికారి ఉంటారు.
- 201-400మంది ఓటర్లకు ఒకప్రిసైడింగ్, ఇద్దరు పోలింగ్ అధికారులు, 401నుంచి 650మంది వరకు ప్రిసైడింగ్ అధికారి, ముగ్గురు పోలింగ్ అధికారులు ఉంటారు.
- 650మంది ఓటర్ల కంటే ఎక్కువఉంటే అదనపు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తారు.

● రిజర్వేషన్ల పీటముడితో..

గ్రామపంచాయతీ ఎన్నికలకు రిజర్వేషన్లు ప్రధానఅడ్డంకిగా మారా యి. గతప్రభుత్వం అమల్లోకి తెచ్చిన పంచాయతీరాజ్ చట్టం- 2018 ఎన్నికల స్థానాలకు రిజర్వేషన్లు పదేళ్లపాటు వర్తిస్తాయని పేర్కొంది. తాజాగా రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో పాతరిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలు నిర్వహిస్తుందా..? లేక ఏమైనా మార్పులు చేస్తుందా..? అనే ఆసక్తి సర్వత్రా నెలకొంది. ఒకవేళ చట్టంలో మార్పులు చేస్తే జనాభా ప్రాతిపదికన ఎస్సీ, ఎస్టీ, బీసీ జనరల్ సామాజికవర్గాలకు రిజర్వేషన్లు కేటాయించే అవకాశముంది. ఇందు కోసం ప్రస్తుతం చట్టంలో మార్పులు చేయాలి. ఇది జరగాలంటే మరోకొత్త చట్టాన్ని అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదం పొందాలి. ఈ ప్రక్రియ మొత్తం జరగాలంటే సమయం పడుతుంది. అయితే బీసీగణన ప్రకారం రిజర్వేషన్లను పెంచే అవకాశం లేపో వడంతో పాతవిధానాన్నే కొనసాగించే వీలుందని ప్రజాప్రతినిధులు పేర్కొంటున్నారు.

- జిల్లాలో 15జడ్పీటీసీలు, 15ఎంపీపీలు, 123ఎంపీటీసీలు ఉన్నారు. వీరికి జూలై 4న పదవీకాలం ముగిసింది. వీటికి కూడా సర్పంచులకు మాదిరిగానే రెండు పర్యాయాలు రిజర్వేషన్ అమల్లో ఉంది. రెండు నెలల వ్యవధిలో సర్పంచి, ప్రాదేశిక ఎన్నికలు జరిగే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో ఆశావహులు ఇప్పటికే ఓటర్లను తమ వైపు తిప్పుకునే ప్రయత్నాలు ప్రాంభించారు.

రేపు రెండో విడత రుణమాఫీ: కలెక్టర్


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, జూలై 29: రుణ మాఫీ పథకంలో భాగంగా ఈనెల30న రెండో విడత రుణమాఫీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. రెండో విడతలో లక్ష నుంచి లక్షన్నర వరకు రుణ మాఫీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. 30న మధ్యాహ్నం 12గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులతో కలిసి రుణమాఫీని లాంఛనంగా ప్రారంభిస్తారని తెలిపారు. రుణమాఫీ ప్రత్యేక సమావేశం నిర్వహించి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టరేట్‌లో వర్చువల్ విధానంలో సీఎం సందేశం అనంతరం జిల్లాలో రైతు రుణమాఫీ రెండో విడత పథకాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. ఈనెల18న మొదటి విడత రుణమాఫీ నిర్వహించిన తరహాలో రెండో విడత రుణమాఫీ అమలు చేస్తామని తెలిపారు. జిల్లాలో రెండోవిడత రుణమాఫీ పథకంలో 14,623మంది రైతులు రూ.153,34,94,379 అందిస్తామన్నారు.

రోగులతో కిక్కిరిసిపోతున్న ఆసుపత్రి

- ఓపీకి రోజుకు 300మంది
- ఇతర మండలాల నుంచి కూడా వస్తున్న రోగులు


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

సిర్పూర్(టి), జూలై 29: ముసురు వర్షంతో మండలంలోని 16గ్రామపంచాయతీల పరిధిలోని 27గ్రామాలకు చెందిన ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. దీనికి తోడు దోమల బెడద, పారిశుధ్య లోపంతో విషజ్వరాలు సోకి ఇంటింటి ఇద్దరు, ముగ్గురు చొప్పున మంచం పడుతున్నారు. కొందరు జ్వరాలతోపాటు వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నారు. సిర్పూర్(టి) సామాజిక ఆసుపత్రికి రోజూ ఓపీకింద 300మందికి వరకు వస్తుండగా 40మంది ఇన్‌పేషంట్లుగా చికిత్స పొందుతున్నారు. మండలం నుంచే కాకుండా 108ద్వారా కౌటాల, చింతల మానేపల్లి, బెజ్జూరు మండలాల నుంచి సైతం రోగులు వస్తున్నారు. దీనికి ప్రధానకారణం పారిశుధ్య లోపమని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై సిర్పూర్(టి) ఆసుపత్రి డాక్టర్ జోగేందర్‌ను ఆన్‌లైన్ సంప్రదించగా వేడిచేసి చల్లార్చిన నీటిని తాగాలని, ఇంట్లో పరిసరాలు శుభ్రంగా ఉంచుకో వాలని, దోమల తెరలను వాడాలని సూచించారు. ఇంట్లో ఓఆర్ఎస్‌ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. జ్వరంవస్తే ప్రభుత్వఆసుపత్రికి రావాలని సూచించారు.

బొగ్గు బావుల వేలం పాటలు రద్దు చేసే వరకు పోరాటాలు

మందమర్రి టౌన్, జూలై 29: కేంద్రం ప్రవేశపెట్టిన బొగ్గుగనుల వేలంను రద్దుచేసేవరకు పోరాటాలు కొనసాగుతుంటాయని సీఐటీయూ రాష్ట్రకార్యదర్శి మంద నర్సింహారావు పేర్కొన్నారు. సోమవారం ఏరియాలోని కేకే5 గని వద్ద నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో ఆయన కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. రాష్ట్రప్రజలు 8మంది ఎంపీలు, 8మంది శాసనసభ్యులను గెలిపించారని, ఇంతజరుగుతుంటే నోరు మెదపకపోవడం ఏంటని ప్రశ్నించారు. కిషన్ రెడ్డి వేలంలో పాల్గొనాలని చెప్పడం సిగ్గుచేటన్నారు. 51 శాతం వాటాఉన్న రాష్ట్రప్రభుత్వం ఈ విషయంపై గట్టిగా పోరాడాలని కోరారు. అనంతరం కార్మికులతో కలిసి వేలంలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్రకమిటీ సభ్యుడు కె ఆశయ్య, మందమర్రి ఏరియా బ్రాంచి కార్యదర్శి వెంకటస్వామి, రామస్వామి, రాజేందర్,ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

'బొగ్గు గనుల వేలాన్ని విరమించుకోవాలి '

కాసిపేట: కేంద్రం అవలంభిస్తున్న కార్మికవ్యతిరేక విధానాలను , బొగ్గు గనుల వేలాన్ని విరమించుకోవాలని సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన బస్సుయాత్రకు పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్లు సీఐటీయూ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి నాగరాజుగోపాల్ తెలిపారు.సోమవారం కాసిపేట 2గనిపై నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ బొగ్గుగనుల వేలాన్ని వెంటనే విరమించుకుని అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం తీర్మాణం చేసి కేంద్రానికి పంపాలన్నారు. అనంతరం పలు కార్మికసంఘాల నాయకులు సీఐటీయూలో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాసిపేట 2వ గని పిట్ కార్యదర్శి బుద్దె సురేష్‌వర్మ, పెరుగు సాయి, మిల్కూరి సతీష్ పాల్గొన్నారు.

మందమర్రి టౌన్: కేంద్రప్రభుత్వం తీసుకున్న బొగ్గు బావుల వేలం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సింగరేణిలో ఉద్యమాలు ఉధృతమవుతున్నాయి. బెల్లంపల్లి, మందమర్రి, శ్రీరాంపూర్ ఏరియాలో బీఎంఎస్ మినహాయిస్తే ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ, సీఐటీయూ, హెచ్ఎంఎస్, టీబీజీకేఎస్ ఇతర ఐఎఫ్‌టీయూ, ఏఐఎఫ్‌టీయూ, ఇతర చిన్నచితకా సంఘాలు గనుల, డిపార్టుమెంట్ల వద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ఈ వేలంపై కేంద్రం, రాష్ట్రం ఎలాంటి నిర్ణయం తీసుకుంటున్నారనేది అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

వార్షిక క్రీడా షెడ్యూల్‌పై స్పందన కరువు: ఏఐటీయూసీ

శ్రీరాంపూర్, జూలై 29: వార్షిక క్రీడాషెడ్యూల్‌పై సింగరేణియాజమాన్యం నుంచి స్పందన కరువైందని ఏఐటీయూసీ ఉపప్రధానకార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కెసమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్‌కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024-25వార్షిక క్రీడా షెడ్యూల్‌కు సంబంధించిన సర్క్యులర్‌ను కోల్ ఇండియా సింగరేణికి పంపించిందన్నారు. కానీ ఇప్పటి వరకు అధికారుల నుంచి స్పందన లేదన్నారు. యువ క్రీడాకారులు సంస్థలో ఉన్నా, వారికి సరైన ఆదరణ లేదని, సీనియర్ క్రీడాకారులనే పోటీలకు పంపతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా క్రీడావిభాగం అధికారులు వెంటనే క్రీడాషెడ్యూల్‌ను ప్రకటించి క్రీడాకారులకు ప్రోత్సాహం అందించాలని, పోటీలకు వారిని సిద్ధం చేయాలని కోరారు.

బాధ్యులపై చర్యలు చేపట్టాలి : బీఎంఎస్

శ్రీరాంపూర్, జూలై 29: జీడీకే-2గనిలో జరిగిన ప్రమాదానికి బాధ్యులైన అధికారులపై చర్యలు చేపట్టాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రమాదానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

శ్రీరాంపూర్ ఏరియాను తనిఖీ చేసిన డైరెక్టర్

శ్రీరాంపూర్, జూలై 29: శ్రీరాంపూర్ ఏరియాను సింగరేణి డైరెక్టర్(ఆపరేషన్స్‌అండ్‌పా) ఎన్‌వీకే శ్రీనివాస్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన వెంట ఏరియా జీఎం బి సంజీవరెడ్డి ఉన్నారు. డైరెక్టర్ ముందుగా వేస్టేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ పనులను తనిఖీ చేశారు. రోజువారీ చెత్త సేకరణ, కంపోస్ట్ ఎరువుతయారీ గురించి తెలుసుకున్నారు. ఆర్కే8డిస్పెన్సరీని సందర్శించి వైద్యసదుపాయాలను తెలుసుకున్నారు.కార్యక్రమంలో ఏరియాఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి,డీజీఎం(సివిల్) ఆనంద్ కుమార్, డీజీఎం(ఏరియా వర్క్‌షాప్) రవీందర్, డిప్యూటీ సీఎంఓ డాక్టర్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

దోమలకు నిలయంగా పరిసరాలు


బొంబాయిగూడలో ఇళ్ల మధ్యలో నిలిచిన వరద నీరు

పెంచికలపేట, జూలై 29: మండలంలోని బొంబాయి గూడగ్రామంలో పలు కూడళ్ల దోమలకు నిలయాలుగా మారాయి. కొన్నిరోజులుగా కురిసిన వర్షాలకు వర్షపునీరు ఎక్కడికక్కడ నిలిచిపోయి వ్యర్థాలతో, చెత్తచెదారాలతో దోమలు వ్యాప్తికి నిలయాలుగా మారాయి. అసలే వ్యాధుల కాలం దోమలను నివారించి పారిశుధ్యంపై ప్రత్యేకశ్రద్ధ వహించాల్సిన సమ యంలో అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా పారిశుధ్యంపై ప్రత్యేకచర్యలు తీసుకొని చెత్తను తొలగించి దోమల వ్యాప్తికి అడ్డుకట్ట వేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ప్రమాదమైనా తప్పని ప్రయాణం


ట్రాక్టర్‌లో చిన్నారితో కలిసి వాగుదాటుతున్న బాలింత

చింతలమానేపల్లి, జూలై 29: దిందా గ్రామస్థులకు వరద ప్రభావం ఇంకా తగ్గలేదు. సోమవారం వర్షం శాంతించడంతో తక్కువ వాగు తక్కువ ఉధృతితో ప్రవహిస్తున్నది. దీంతో వివిధ అవసరాల నిమిత్తం మండలకేంద్రానికి చేరుకునేందుకు ఆగ్రామస్థులు వరదనీటిలోనే ప్రమాదకరంగా ప్రయాణం సాగిస్తున్నారు. పెంచికలపేట మండలం ఎల్లూరుకు చెందిన గోలేటి మమత తన రెండు నెలల పాపతో ట్రాక్టర్‌లో దిందా గ్రామానికి చేరుకుంది. నిత్యావసరాలు వివిధ అవసరాల కోసం ప్రతిరోజు ఇలాగే ప్రమాదకరంగా ప్రయాణాలు సాగిస్తున్నామని గ్రామానికి చెందిన గోలేటి చిన్నక్క ఆవేదన వ్యక్తం చేసింది. త్వరగా బ్రిడ్జి నిర్మించి తమ ఇబ్బందులు తొలగించాలని వారు విజ్ఞప్తి చేశారు.



మేనేజర్ కుటుంబానికి సంతాపం

శ్రీరాంపూర్, జూలై 29: శ్రీరాంపూర్‌లోని ఎస్ఆర్పీ1 గని మేనేజర్ విజయ్‌కుమార్ కుమార్తె తానియా సోనీ ప్రమాదవశాత్తు మరణించడంపై హెచ్ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, కార్యదర్శి వి అనిల్‌రెడ్డి, పిట్ కార్యదర్శి రేగుంట సందీప్ ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. విజయ్ కుమార్ కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు ఒకప్రకటనలో సంతాపంతెలిపారు. సోనీ మరణంపై నివాళులు అర్పిస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

వృత్తి శిక్షణతో ఉపాధికి ఊతం: జీఎం

శ్రీరాంపూర్, జూలై 29: వృత్తిశిక్షణతో ఉపాధికిఊతం లభిస్తుందని శ్రీరాంపూర్ జీఎం బి సంజీవరెడ్డి, సేవాఅధ్యక్షురాలు బి రాధాకుమారి అన్నారు. సేవా ఆధ్వర్యంలో టైలరింగ్,మగ్గంవర్క్,జ్యూట్‌బ్యాగ్ మేకింగ్, బ్యూటీషియన్ కోర్సులలో ఉత్తీర్ణులైన 252మందిమహిళలకు ఖాదీగ్రామోద్యోగ్ సర్టిఫికెట్లను శ్రీరాంపూర్‌లోని సీఈఆర్ క్లబ్‌లో సోమవారం వారు అందజేశారు. ఎస్ఆర్పీ1 గని మేనేజర్ కుమార్తె తాన్యా మృతికి సంతాపకంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా, డీజీఎం(పర్సనల్) పి అరవిందరావు పాల్గొన్నారు.

'సింగరేణి ఆసుపత్రిపై నిర్లక్ష్యం వీడాలి'

బెల్లంపల్లి, జూలై 29: బెల్లంపల్లిలోని సింగరేణి ఏరియా ఆసుపత్రిపై నిర్లక్ష్యం వీడి అభివృద్ధి చేయాలని సింగరేణి ఆసుపత్రి పరిరక్షణ కమిటీ నాయకులు పేర్కొన్నారు. సోమవారంసింగరేణి ఆసుపత్రి ముందు మాట్లాడుతూ ఆసుపత్రిని మూసివేయడానికి యాజమాన్యం కుట్రలు చేస్తోందన్నారు. 20రోజుల నుంచి మెడికల్ స్టోర్, ఫిమేల్,మేల్ వార్డులను మూసివేశారని తెలిపారు. కేవలం క్యాజువాలిటీలో 20బెడ్లు ఉండగా నలుగురు పేషెంట్లు మాత్రమే ఉన్నారని, మిగితా వారిని రామకృష్ణపూర్, గోదావరిఖని సింగరేణి ఆసుపత్రులకు రెఫర్ చేశారన్నారు. ఆసుపత్రిలో సరైన వైద్యులు, సిబ్బంది, స్కావెంజర్లు లేరని తెలిపారు. ఇద్దరు సిస్టర్స్‌తోనే ఆసుపత్రి నడుస్తుందన్నారు. వెంటనే బెల్లంపల్లి ఎమ్మెల్యే చొరవ తీసుకుని ఆసుపత్రికి పూర్వ వైభవం తీసుకురావాలని కోరారు.

సింగరేణి భవన్‌లో సీఎండీ జన్మదిన వేడుకలు


సింగరేణి భవన్‌లో మొక్క నాటుతున్న సీఎండీ

శ్రీరాంపూర్, జూలై 29: సింగరేణి సీఎండీ ఎన్ బలరాం జన్మదిన వేడుకలు సోమవారం సింగరేణి భవన్‌లో ఘనంగా నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఆయన తన చేతులమీదుగా మొక్కను నాటారు. సింగరేణి ఉద్యోగులు సైతం తమవంతు బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించడాన్ని యజ్ఞంగా స్వీకరించాలని కోరారు.

ఘనంగా సీఎండీ బర్త్‌డే వేడుకలు

శ్రీరాంపూర్: సీఎండీ ఎన్ బలరాం జన్మదినం సందర్భంగా శ్రీరాంపూర్ సీహెచ్‌పీ ఆవరణలో ఏరియా జీఎం బి సంజీవరెడ్డి ఉద్యోగులతో కలిసి మొక్కలు నాటారు. బలరాం సింగరేణి వ్యాప్తంగా సుమారు 18వేల మొక్కలు నాటారని, ఆయనను ఆదర్శంగా తీసుకొని సింగరేణి ఉద్యోగులు, అధికారులు మొక్కలు నాటడం అభినందించదగిన విషయమన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్‌కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా, ఏజీఎం(ఈఅండ్ఎం) బి. చంద్రశేఖర్ రెడ్డి, ఏజెంట్ ఏవీ రెడ్డి, డీజీఎం(సివిల్) కె. ఆనంద్ కుమార్, తదితరులు పాల్గొ న్నారు.

ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో

ఐఎన్‌టీయూసీ సీఎస్‌పి పిట్‌కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కేక్‌కట్ చేసి విఠాయిలు పంపిణీ చేశారు.కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు జె శంకర్‌రావు, నాయకులు తిరుపతిరెడ్డి, అరకాల శ్రీనివాస్, రాయలింగు పాల్గొన్నారు.

మందమర్రి టౌన్:మందమర్రి ఏరియాలోని కేకే5గనిపై సోమవారం సీఎండీ బలరాం జన్మదిన వేడుకలను కార్మికులు ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేశారు. ఆయన జన్మదినం సందర్భంగా పట్టణంలోని పలు స్వచ్ఛందసంస్థలు మొక్కలను పంపిణీ చేశాయి.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రలు చేస్తున్నాయి


సమావేశంలో మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

కాసిపేట, జూలై 29: సింగరేణిని ప్రైవేటీకరణ చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రలు పన్నుతున్నాయని సీపీఐఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. సోమవారం సింగరేణి పరిరక్షణ బస్సుయాత్రలో భాగంగా సోమగూడెం చేరుకున్న అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్‌పార్టీలు బొగ్గుగనుల ప్రైవేటీకరణకు వ్యతిరేకమని అంటూనే అంతర్గతంగా ప్రైవేటీకరణను ప్రోత్సహిస్తున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. శ్రావణపల్లి బొగ్గుబావుకు వేలం వేయడం ఏంటని ప్రశ్నించారు. ఈ వేలం పాటలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలు పాల్గొనడం దేనికి నిదర్శనమన్నారు.సింగరేణి పరిరక్షణకు ఆగస్టు5వరకు బస్సుయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. ఈ యాత్రతో కార్మికులను, ప్రజలను చైతన్యవంతం చేసి ప్రైవేటీకరణ విరమించేలా పోరాటాలు చేస్తామన్నారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్క రాములు, జిల్లా కార్యదర్శి సంకె రవి, దాసరి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నీటి కుంటలో పడి బాలుడు మృతి


సుఫియాన్ మృతదేహం

బెజ్జూరు, జూలై 29: స్నేహితుడితో కలిసి సరదాగా ఆడుకుందామని వెళ్లిన బాలుడు తిరిగిరాని లోకాలకు వెళ్లాడు. అప్పటివరకు ఇంట్లో ఆటలాడుతూ ఆనందంగా గడిపిన బాలుడు ఒక్కసారిగా లేడని తెలియడంతో ఆ కుటుం బంలో తీరని విషాదం నెలకొంది. ఎస్సై విక్రం తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని గడిఅహిరి గ్రామానికిచెందిన యూసుఫ్‌అలీ,నస్రీన్ దంపతులు ఆరు నెలల క్రితం మండలంలోని మర్తిడిగ్రామానికి వచ్చారు. గ్రామంలోనే కూలిపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం పెద్దకుమారుడు సుఫియాన్(6), స్నేహితుడితోకలిసి ఆటలాడుతూ గ్రామసమీపంలోని నీటికుంటలో ప్రమాదవశాత్తు పడ్డాడు. దీంతో స్నేహితుడు ఆఫాన్ గ్రామంలోకి వచ్చి చెప్పడంతో కుటుంబసభ్యులు వెళ్లిచూసేసరికి అప్పటికే సుఫియాన్ మృతిచెందాడు. పొట్టకూటికోసం రాష్ట్రం దాటివస్తే తమ కుమారుడు మృత్యువాత పడ్డాడని ఆ కుటుంబం కన్నీరు మున్నీరవుతోంది. మృతుడి తండ్రి యూసుఫ్‌అలీ ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసునమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

వాంకిడి, జూలై 29: ఇంటిపరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని హెచ్ఈవో రవిదాస్ సూచించారు. సోమవారం మండలంలోని గణేష్‌పూర్ గ్రామంలో ఇంటింటికివెళ్లి ప్రజలకు కాలానుగుణంగా వచ్చేవ్యాధులపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటుచేసి ప్రజలకు మందులు పంపిణీచేశారు. కార్యక్రమంలో కారోబారి గోపాల్‌రావు, ఆశా కార్యకర్త మనుకుబాయి పాల్గొన్నారు.

షీటీం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు

రెబ్బెన, జూలై 29: రెబ్బెన రైల్వేస్టేషన్‌పరిధిలో సోమవారం షీటీం సభ్యులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షీటీం ఇన్‌చార్జీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మహిళలపై హింస, ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైంపై, చట్టాలపై కూడా అవగాహన కల్పించారు.